# నీతి కథలు

3

నీతి కథలు - 3

Akhlaqui Kahaniyan - 3
(Telugu)

# నీతి కథలు

(మూడవ భాగం)


మూలం
**మౌలానా అఫ్‌జల్ హుసైన్** M.A. Litt.

అనువాదం
**అబ్బాదుల్లా** B.A.



HYDERABAD

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్**
సందేశభవనం, ఛత్తాబజార్,
హైదరాబాద్-500 002.

Neeti Kathalu - 3

Akhlaqui Kahaniyan-3 (Telugu)

TIP Series No. 44

Compiled by : Maulana Afzal Hussain M.A., Litt.,

Translated by : Abbadullah B.A.

All Rights Reserved with publishers

6th Edition : December 2015

Copies : 2000

Price : Rs. 20

ISBN : 81 - 86826 - 60 - 2

Published by Telugu Islamic Publications Trust (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

కరుణించేవాడు కనికరించేవాడయిన అల్లాహ్ పేరుతో

# మంచి నడవడిక

భారతదేశాన్ని ఎందరో రాజులు పరిపాలించారు. ప్రభుత్వాధికారం దేవుడు వారి హస్తగతం చేశాడు. పాలకులు కూడా దైవకృపను మరువకుండా పాలితులను ప్రేమగా చూసుకున్నారు. సత్ప్రవర్తనతో మెలిగారు. ప్రజల మన్ననల్ని పొందారు. తాము అధికులమని గర్వించకుండా దైవ సమక్షంలో అల్పులమనే తలంపుతోనే జీవించారు. ఇతరుల మనస్సు నొప్పించలేదు. ఇతరులు తమను తప్పుపట్టినప్పుడు దానికి తలవొగ్గారు. ముఖ్యంగా అతిథులంటే అతి జాగ్రత్తగా మెలిగేవారు. వారిని గౌరవించడం తమ విధిగా భావించేవారు. తమకంటే అతిథుల గౌరవమే అధికమని భావించేవారు.

నాసిరుద్దీన్ మన దేశాన్ని పాలించాడు. రారాజు అయినప్పటికీ నిరాడంబరంగా జీవించే సద్గుణ సంపన్నుడు. ప్రభుత్వ ధనాగారంపై సర్వాధికారం కలిగి ఉన్నప్పటికీ, సొంత పోషణ ఖర్చులకు మాత్రం అందుండి చిల్లిగవ్వయినా తీసుకునేవాడు కాదు. రాజు అయినంత మాత్రాన సొంత అవసరాలు లేకపోతాయా! నాసిరుద్దీన్ ప్రజలకు ఆదర్శంగా నిలబడ్డాడు. ఆ కాలంలో అచ్చు యంత్రాలు ఉండేవి కావు. చేతి వ్రాతతో, అందమయిన వ్రాతతో పుస్తక ప్రతులు తయారు చేయడం కూడా ఆనాడు ఒక వృత్తి. ముఖ్యంగా ముస్లిమ్‌లు ఈ వృత్తిలో నిపుణులు. దివ్య ఖుర్‌ఆన్, ఇంకా ఇతర గ్రంథాల ప్రతులు చేతి వ్రాతతో మనోహరంగా వ్రాసేవారు. కుటుంబ పోషణ కోసం నాసిరుద్దీన్ కూడా ఈ వృత్తినే పాటించారు. ఖుర్‌ఆన్ మరియు ఇతర గ్రంథాల నకళ్ళు వ్రాసేవాడు. వచ్చిన ఆదాయం స్వంత ఖర్చులకు వాడుకునేవాడు.

ఒకనాటి సంఘటన. ధనవంతుడొకడు నాసిరుద్దీన్‌తో కలిసేందుకు వచ్చాడు. వచ్చిన పని అయ్యాక, నాసిరుద్దీన్ ఆ భాగ్యవంతునికి తాను సువర్ణ అక్షరాలతో వ్రాసిన దివ్య గ్రంథం ప్రతి నొకదానిని చూపించాడు. అందమైన అక్షరాలతో ఎంతో సుందరంగా, పఠించేందుకు అనుకూలంగా ఉంది దాని

వ్రాత. అతిథి గ్రంథాన్ని చూచాడు; ముగ్ధుడయ్యాడు. కాని ఆ గ్రంథాన్ని మారు మారు ఇటు అటు త్రిప్పుతూ తీవ్రాలోచనలో పడిపొయ్యాడు. చివరకు అయ్యా ఇందులో కొన్ని తప్పులున్నాయి. సరిదిద్దుకోండన్నాడు. కొన్ని పదాలను తప్పుగా చూపించాడు. వాస్తవంగా అవి తప్పులు కావు, ఒప్పులే. విషయం నాసిరుద్దీన్‌కు బాగా తెలుసు. అయినా రాజు చిరునవ్వుతో అతిథికి కృతజ్ఞతలు తెల్పుకొన్నాడు. మరేమి అనుకోకుండా తప్పులుగా చూపిన వాటికి గుర్తుగా అక్కడ సున్నాలు వేసుకున్నాడు. వాటిని "సరిదిద్దుకొంటానండి" అని మాత్రమే అన్నాడు.

రాజుగారి నిండు దర్బారులో జరిగిందీ సంఘటన. నాసిరుద్దీన్ వ్రాత అంటే అందరికీ ఎనలేని ప్రీతి. మచ్చలేని ప్రతుల తయారీకి ఆయన ప్రతిభ పొందాడు. అందరూ ఆశ్చర్యంలో మునిగిపొయ్యారు. అతిథి పట్ల రాజుగారి ఉదారబుద్ధి అక్కడ ఉన్నవారినందరినీ ఆలోచనల్లో పడేసింది. అతిథి నిష్క్రమించాడు. పుస్తకంలో వేసిన గుర్తుల్ని తుడిచివేశాడు రాజు. కొలువులో ఉన్నవారు ఇంకా ఆశ్చర్యపడిపోయారు. "ఇదంతా మా కర్థంకావటం లేదు రాజా" అని వారు విన్నవించుకున్నారు. "ఏమీ లేదు, అతిథి సత్కారం మా కర్తవ్యం. విచ్చేసిన వ్యక్తి మాకు అతిథి. అతను సూచించిన పదాలలోగాని, వ్రాతలోగాని తప్పులు లేవు. తప్పులు లేవని వాదించి, అతిథిని అవమానం పాలు చెయ్యడం నాకిష్టం లేకపోయింది. అతని మనస్సుకు కష్టం కలిగించక తప్పులని చూపెట్టినవాటిని గుర్తుపెట్టుకున్నాను, వెళ్ళిన వెంటనే వాటిని తుడిచివేశాను, అంతే" అన్నాడు రాజు.

రాజుగారి ప్రవర్తన కొలువులోనివారిని సంభ్రమాశ్చర్యాల్లో పడవేసింది. ఎంత గొప్పరాజు! ఒక మామూలు మనిషి దౌర్భాగ్యంగా ప్రవర్తించినా చక్కటి ప్రవర్తనతో అతిథి మనస్సును నొప్పించక వీడ్కోలిచ్చి పంపాడు గదా! అని అందరు రాజు గారి ఘనతను శ్లాఘించారు.

# స్వార్థరహిత జీవనం

మహా ప్రవక్త (సఅసం) సహచరులలో హజ్రత్ సల్మాన్ ఒక విశిష్ట స్థానాన్ని పొందాడు. ఈయన ఈరాన్ దేశస్థుడు. ఇస్లామ్ విప్లవ ప్రభావం వల్ల ముస్లిమ్ అయ్యాడు.

హజ్రత్ సల్మాన్ బాల్యం సుఖసౌఖ్యాలతో గడిచింది. కలవారింట పుట్టాడు. సల్మాన్ అంటే అతని తండ్రికి ఎంతో ప్రేమ. అంచేత ఆయన బాలుణ్ణి ఇంటి బయట కాలు కూడా పెట్టనీయకుండా కష్టాలకు, దుఃఖాలకు కడు దూరంగా గారాబంగా పెంచాడు.

సల్మాన్‌కు ఆధ్యాత్మిక చింతన అధికంగా ఉండేది. ఆధ్యాత్మికతతో ఉన్నత సోపానాలు ఎక్కాలని ఆయన అభిలాష. మజూసీల (అగ్ని ఆరాధకుల) ఇంట జన్మించాడు. అగ్నినారాధించటం మొదలెట్టాడు. కాని ఏదో అవసరం మీద ఒక దినం ఇంటికి దూరంగా పోవలసివచ్చింది. పనిచూసుకుని తక్షణం ఇంటికి రావలసిందని తండ్రి చెప్పి పంపాడు. గడపదాటి వెళ్ళని సల్మాన్ దారిపొడవునా అగుపించే ప్రపంచాన్ని అత్యాసక్తితో చూడసాగాడు. మార్గమధ్యంలో ఒక క్రైస్తవ ప్రార్థనాలయం ఎదురయింది. అప్పుడు అందులో ప్రార్థనలు జరుగుతున్నాయి. దైవ చింతన అంటే భక్తిశ్రద్ధలు గల సల్మాన్‌కు క్రైస్తవ ప్రార్థనా పద్ధతులు నచ్చాయి. తాను వాస్తవంగా దైవదాసుడు కావాలంటే దైవాన్ని, దైవ ధర్మాన్ని గూర్చి అసలు యథార్థాన్ని తెలుసుకోవాలి అనే కోరిక అతని హృదయంలో నాటుకుపోయింది. సత్య ప్రేమికులకు ఎన్ని అవరోధాలు అడ్డువచ్చినా అవి నిలుస్తాయా! సల్మాన్ ఒక వర్తక బిడారం చేరాడు. వారితోపాటు సిరియా దేశం వెళ్ళాడు. క్రైస్తవ మత గురువుల్ని కలిశాడు. వారి సేవ చేస్తూ సత్యాన్వేషణ ప్రారంభించాడు. ఎన్నో ఏండ్లు గడిచాయి. కాని సత్య తృష్ణ తీరలేదు. చివరకు క్రైస్తవ మత గురువుల కొన్ని మాటలు ఆయన చెవినపడ్డాయి. అరబ్బు దేశంలో చివరి దైవ ప్రవక్త రానున్నాడు. ఆ ఘడియకై ఎదురుచూస్తూ ఉండాలని వారనుకుంటూ ఉండగా విన్నాడు. సత్యమార్గాన్వేషి అయిన సల్మాన్ వెంటనే అరేబియా దేశానికి వెళ్ళాలనుకున్నాడు. అప్పట్లో సల్మాన్ గొర్రెల్ని పెంచేవాడు. కొద్ది రోజులలోనే ఒక అరబ్ వర్తక బిడారం సిరియా వచ్చింది. గొర్రెల మందను అరబ్బులకు అప్పగించాడు. తనను వారి దేశానికి తీసుకెళ్ళమని కోరాడు. దురదృష్టవశాత్తు ఎదురయిన ఆ అరబ్బులు లేశమాత్రమయినా విశ్వాసంలేని పోకిరి జనం. తమ దేశానికి తీసుకెళతామని మాట ఇచ్చి మార్గమధ్యంలోనే సల్మాన్‌ను బానిసగ చేశారు; అరబ్బు దేశం రాగానే ఒక యూదునికి అమ్మేశారు. స్వేచ్ఛను కోల్పోయిన సల్మాన్ సహనంతో జీవితం

గడుపుతూ వచ్చాడు. నిజ ప్రవక్తను కనులారా గాంచి సంపూర్ణ దైవ విశ్వాసిగా జీవించాలని వచ్చిన సల్మాన్  బానిసగా ఉంటూ విపరీతమయిన కష్టాలకు గురయ్యాడు.

తాను ఎదురుచూస్తూ వచ్చిన ఘడియ రానే వచ్చింది. మహాప్రవక్త (సఅసం) ప్రపంచంలో  ఒకే దేవుని దాస్యం చెయ్యాలని ప్రచారం చెయ్యసాగారు. అదృష్టవంతులు పడే శ్రమ వృధాపోదు. సల్మాన్ మరొక యజమానికి అమ్ముడుపోయాడు. ఆ యజమాని వెంట మదీనా చేరాడు. అక్కడే ఆయన మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ను చూచే మహా భాగ్యానికి నోచుకున్నాడు. మహాప్రవక్త పట్ల విశ్వాసం ప్రకటించాడు. మహా ప్రవక్త సహాయ సహకారాలతో స్వేచ్ఛను పొంది విశ్వాసపాత్రుడయిన సహచరుడుగా విరాజిల్లాడు.

హజ్రత్ సల్మాన్, హజ్రత్ ఉమర్ ప్రాతినిధ్యపాలన కాలంలో " మదాయిన్" (యమన్) ప్రదేశ గవర్నరయ్యాడు. కాని ఆయన గవర్నరుగా గడిపిన జీవితం అత్యద్భుతమయింది. వచ్చే జీతాన్ని బీదలకు, అనాధలకు దానం చేసేవాడు. ఖర్జూరపు ఆకులతో చాపలల్లి పొట్టపోసుకునేవాడు. ఆ గవర్నరుగారికి ఉండడానికి ఇల్లు కూడా ఉండేది కాదు. అన్నం తినేందుకు ఒక పాత్ర, నీరు త్రాగేందుకు ఒక గిన్నె అవే ఆయన  జీవిత సామగ్రి. మరణ ఘడియలు సమీపిస్తుంటే ఆ రెండు వస్తువులను చూస్తూ ఈ రెంటి భారం కూడా తీసుకెళుతున్నానే అని ఆవేదన చెందాడు ఆ నిస్వార్థ జీవి.

# సాహసం

సాహసం అందరికీ  అబ్బే గుణం కాదు. ఎవరి హృదయంలో దైవ భయం నిండుగా ఉంటుందో వారికే అబ్బుతుంది.  చరిత్ర పుటల్లో పేరు ప్రతిష్ఠలు పొందిన సాహసోపేతులు ఎందరో  కలరు. కాని సాహసపరులని  అనుకోవడం ఒక వంక, సమయం వచ్చినప్పుడు సాహసాన్ని ప్రదర్శించి సమాజాన్ని రక్షించే మహాభాగ్యం పొందడం  మరో వంక. ఒక సంఘటన వినండి:

మహాప్రవక్త (సఅసం) సహచరుల జీవితం ధైర్యసాహసాలకు ప్రతీక. అందులో హజ్రత్ ఉస్మాన్ ఖిలాఫత్ కాలంలో ఎందరో వీర కిశోరాలు  పైకి వచ్చి సమయస్ఫూర్తితో సాహసాన్ని ప్రదర్శించి సాటిలేని మేటి వీరులుగా

పరిగణింపబడ్డారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖలీఫాగా రాజ్యమేలుతున్నారు. ఆ కాలంలో రోమన్ రాజ్యం అగ్రరాజ్యంగా ఉండేది. ఏదో కారణం వల్ల ముస్లిమ్‌లకు, రోమన్‌లకు మధ్య యుద్ధం సంభవించింది. ప్రతి సైన్యానికి సైన్యాధిపతి ఒకడుంటాడు. ఈజిప్ట్ గవర్నర్ ముస్లిమ్‌లకు సైన్యాధిపతి అయ్యాడు. ఇరవై వేల యుద్ధ వీరులతో రణరంగంలో దిగాడు. రోమన్‌లకు కూడా సైన్యాధిపతి ఉన్నాడు. దాదాపు రెండు లక్షల బలగంతో రోమన్ నాయకుడు యుద్ధానికై విజృంభించాడు. యుద్ధం హోరాహోరిగా జరుగుతూ ఉంది. ఎవరి ఎత్తుగడలు వారు వేస్తున్నారు. రోమనుల సైన్యాధిపతి తన సైన్యానికి లాలూచీ చూపించి వారిని యుద్ధంలో ముందుకు దూకడానికి పురికొల్పాలని యోచించాడు, యుద్ధ మైదానంలోనే ప్రకటన చేశాడు. ఎవరయితే ముస్లిమ్‌ల సైన్యాధిపతిని చంపి వస్తారో వారికి నేను అల్లారుముద్దుగా పెంచుతున్న నా బిడ్డను ఇచ్చి వివాహం చేయడమే కాకుండా ఒక లక్ష దీనార్లు కానుకగా బహూకరిస్తానన్నాడు.

ఈ ప్రకటన దావానలంలా ఇరువర్గాల సైన్యంలో వ్యాపించింది. ముస్లిమ్ యోధులు కూడా కొందరు ఈ ప్రకటన విని చలించిపోయారు. కాని ముస్లిమ్‌ల సైన్యంలో ఉన్న యువకిశోరం హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ మాత్రం ఏ మాత్రం చలించలేదు. నిండు యవ్వనం తొణికిసలాడుతోంది. కండబలంతో, గుండె సాహసంతో శత్రు సైన్యాన్ని వధించి, పరాజయంపాలు చేయాలని దృఢసంకల్పంతో ముందు వరుసలోకి చొచ్చుకువస్తున్నాడు. శత్రు సైన్యాధిపతి చేసిన ప్రకటనకు ఇంత కలవరపడవలసిన పనేముంది. మన తరఫున కూడా ప్రకటన ఇలా చెయ్యండి. "ముజాహిద్‌లలో ఎవరయితే రోమన్ సేనాధిపతిని చంపివస్తారో అతనికి ఆ సేనాధిపతి బిడ్డతో వివాహం చేయించడమే కాకుండా ఒక లక్ష దీనార్ల పారితోషికం బహూకరిస్తాము. పైగా ఆ సేనాధిపతి అధీనంలోనున్న ప్రాంతాలన్నింటికి పరిపాలకునిగా నియమిస్తాం."

యుద్ధం ఎంతోసేపు జరిగింది. ప్రతి వర్గం భీకర సమరం సాగిస్తూంది. హజ్రత్ అబ్దుల్లాహ్ దృష్టి రోమన్ సేనాధిపతిపై పడింది, ఎక్కడున్నాడు? సేనల వెనుక ఇద్దరు దాసీలు వింజామరలు వీస్తుంటే చల్లని గాలి పీలుస్తూ తమాషా చూస్తున్నాడు. సూక్ష్మదృష్టితో, మనస్తత్వాన్ని గుర్తించే జ్ఞానం గల అబ్దుల్లాహ్ రోమన్ సైన్యాధిపతిని వొట్టి పిరికిపంద అని గ్రహించాడు: అంచేతనే సమానంగా

తూగగల సేనాపతితో యుద్ధం చెయ్యకుండా సైనికులకు లాలూచీ చూపించి తన ప్రాణాన్ని కాపాడుకోదలిచాడు అని గ్రహించాడు అబ్దుల్లాహ్. ఈ రహస్యాన్ని గుర్తించిన ఈ ముజాహిద్ ధైర్యసాహసంతో ముందడుగు వేస్తూ, శత్రుసేనలను చీల్చుకుంటూ, దాసీల మధ్య ఉన్న రోమన్ సేనాధిపతిపై విరుచుకుపడ్డాడు. శత్రు సేనలను లెక్క చేయకుండా ఒకే ఒక వ్యక్తి ఈ విధంగా ముందుకు రావడం చూస్తూ మొదట ఆ సేనాధిపతి "బహుశా సంధి సందేశం తీసుకు వస్తున్నాడేమో" అని అనుకున్నాడు. కాని ఆ యువ కిశోరం ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా చేపట్టిన కత్తితో తటాలున రోమన్ సేనాధికారి శిరస్సును ఖండించి, దానినొక ఈటెకు గ్రుచ్చి అందరికి చూపిస్తూ తన స్నేహితుల మధ్యకు చేరాడు. సేనాధిపతిని కోల్పోయిన సైనికులు కాళ్ళకు బుద్ధి చెప్పి పలాయనం చిత్తగించారు. ఒక్క సాహసి చూపిన గుండె బలంతో ముస్లిములు విజయోన్ముఖులయ్యారు.

# నిషిద్ధం దరిదాపులకు కూడా చేరకండి

ఇస్లామ్ మనిషిలో వినయ విధేయతలను సృష్టిస్తుంది. పాపభీతిని కలిగిస్తుంది. చెయ్యవలసిన మంచి పనులేమిటో, చెయ్యరాని చెడ్డ పనులేమిటో తెలుపుతుంది. ఆర్జించే విషయంలో కూడా అంతే. ఏ పనులు చేసి సంపాదించాలో తెలుపడమే కాకుండా నిషిద్ధమయిన పనులేమిటో స్పష్టంగా తెలుపుతుంది. ఆ పనుల దరిదాపులకు కూడా చేరకండి అని ఆదేశిస్తుంది. నిషిద్ధమయిన పనుల వల్ల ఎవరయినా నాలుగు డబ్బులు సంపాదించి వాటిని ఆరగిస్తే అతను చేసిన మంచి పనుల పుణ్యఫలాలు వ్యర్థమైపోతాయి. మనిషి జీవితం బూడిదపాలయిన పన్నీరయి పోతుంది.

ఒకనాటి సంఘటన వినండి: హజ్రత్ అబూబక్ర్ గొప్ప విశ్వాసి. ఆయనకొక పాలేరు ఉండేవాడు. సమయానుకూలంగా నాలుగు డబ్బులు సంపాదించుకోవ డానికి హజ్రత్ అబూబక్ర్ పాలేరుకు అవకాశమిచ్చేవారు. ఆ పాలేరు కూడా యజమాని మన్నన పొందినవాడే. ఎప్పుడయినా, ఏదైనా సంపాదించుకుని వస్తే యజమానికి కూడా ఆచారం ప్రకారం ఏమైనా ఇచ్చేవాడు. హజ్రత్ అబూబక్ర్ (రజి) అప్పుడప్పుడు వాటిని వాడుకునేవారు.

ఒకనాడు పాలేరు బజారుకెళ్ళాడు. తినే వస్తువులు కొన్ని తెచ్చాడు. అలవాటు ప్రకారం కొంత భాగం యజమానికి అర్పించుకున్నాడు. ఆయన కూడా వాటిని తినడం మొదలెట్టారు. అకస్మాత్తుగా పాలేరు ఒక ప్రశ్న వేశాడు. "అయ్యా, మీరిప్పుడు తింటున్న పదార్థం నాకెలా లభించిందో తెలుసా?" అన్నాడు.

"నాకేం తెలుసు, విషయం ఏమిటో నీవే చెప్పు" అని అన్నారు హజ్రత్ అబూబక్ర్ (రజి). పాలేరు ఇలా అన్నాడు:

"నేను ఇస్లామ్ మహాభాగ్యానికి చేరువకాని రోజుల్లో జ్యోతిష్యం చెప్పేవాడిని. అసలు జ్యోతిష్యమంటే ఏమిటి? కాలజ్ఞానం అంటే ఏమిటో నాకు తెలియదు. ప్రజల్ని మోసగించే వాణ్ణి. అలా ఒక వ్యక్తికి జ్యోతిష్యం చెప్పాను. ఈనాడు ఆ వ్యక్తి కంట నేకనబడ్డాను. పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఎప్పుడో చెప్పిన జ్యోతిష్యానికి ప్రతిఫలంగా ఇచ్చాడు. అదే మీకిచ్చాను, మీరు తింటున్నారు."

ఇది వినడంతోనే హజ్రత్ అబూబక్ర్ (రజి) ముఖకవళికలు మారిపోయాయి. చటుక్కున లేచి నోటిలో వ్రేలు వేసి తిన్నదంతా కక్కేశారు. మీరే ఆలోచించండి. జ్యోతిష్యం నిషిద్ధం కదా. దాని సంపాదన ఏ మంచి వ్యక్తి అయినా తింటాడా?

# శ్రమజీవనం

మహాప్రవక్త (సఅసం)కు తన అనుచరులంటే ఎంతో ఇష్టం. ఆ అనుచరులు కూడా మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) సన్నిధిలో హాజరై ధార్మిక విషయాలు నేర్చుకోవాలని ఎంతో కుతూహలపడేవారు. ఒకనాటి విషయం. మహాప్రవక్త తన అనుచరుల మధ్య ఆసీనులయి ఉన్నారు. ఇంతలో ఓ వ్యక్తి అక్కడికి వచ్చాడు. వినయంగా అందరికీ సలామ్ చేసి కూర్చోబోయాడు. వచ్చిన వ్యక్తికి మహాప్రవక్త ప్రేమపూర్వకంగా స్వాగతం పలికి, కరచాలనం చేస్తూ తన ప్రక్కన కూర్చోవడానికి చోటు ఇచ్చారు. కాని మహాప్రవక్త (సఅసం)కు అతని అరచేతుల్లో నల్లని మరకలు కనబడ్డాయి. మహాప్రవక్త ఆశ్చర్యపోయారు. "తమ్ముడూ! నీ అరచేతులపై ఏవో మరకలున్నాయేమిటి? ఈ నల్లని గుర్తులు ఎలా ఏర్పడ్డాయి?" అని అడిగారు. అతను కంగారుపడుతూ, "లేదండీ, అసలు విషయం ఏమిటంటే కుటుంబ పోషణకై రాళ్ళుగొట్టే పనిచేస్తున్నాను. వచ్చిన కూలీతో ఇల్లు గడుపుకొంటున్నా. సుత్తెను పట్టి రాళ్ళను పగులగొట్టడం మూలాన చేతులు కాయలు కాసాయి.

నల్లని మరకలు ఏర్పడ్డాయి. అంతే, నేనేమీ చేతులకు పూయలేదండి" అన్నాడు ఆ వ్యక్తి చేతులు నలుపుకుంటూ. అనుచరుని సమాధానం మహాప్రవక్తకు ఆనందం కలిగించింది. వెంటనే నల్లని కాయలు కాచిన అతని చేతిని ముద్దుపెట్టుకున్నారు, కష్టపడి సంపాదించడం పట్ల తనకున్న గౌరవాన్ని వ్యక్తం చేశారు మహాప్రవక్త (సఅసం).

వాస్తవంగా ఇది సంతోషదాయకమయిన ఒక సంఘటన. ఎందుకంటారా? ఒక నిరుపేద అందనిదానికి అర్రులు చాచి పగటి కలలు కనడం కంటే కష్టపడి చెమటోడ్చి, కూలీనాలితో ఆలుబిడ్డలకు రెండు మెతుకులు పెట్టి పోషించుకోవడం ఎంతో మేలు. లేనిపోని ఆశలు పెంచుకోకుండా ఉన్నంతలో ముతకో సతకో తొడిగించడం, కాస్త నీడను సమకూర్చుకోవడం అత్యుత్తమం. కూలిపనివాడని చిన్నచూపు చూడకుండా నిజమయిన సమతా భావం, ఆదరణ గౌరవాలు కనబరిచారు మహాప్రవక్త (సఅసం). కష్టజీవి అంటే తనకు కలిగే ఆనందాన్ని వ్యక్తం చేశారు. అతని చేతుల్ని చుంబించి, ఎవరికీ ప్రాప్తం కాని భాగ్యాన్ని ఆ కష్టజీవికి కలగజేశారు దేవుని అంతిమ సందేశహరులు (సఅసం). డబ్బు, హోదా, పలుకుబడి, శక్తి కలవారు ఆయన సహచరుల్లో ఎందరు లేరూ? కాని ఎవరూ మహాప్రవక్త మెప్పును పొంది, ఆయన మనసారా అభినందిస్తూ అందజేసిన ఆ ప్రేమ ప్రదర్శనను అనుభవించలేకపోయారు, ఆ గౌరవమర్యాదలు కాయకష్టం చేసే మరకల చేతులే నోచుకున్నాయి. శ్రమజీవికి ధార్మిక మార్గంలో ఉన్నస్థానం అందరికీ తెలియవచ్చింది.

# పరువుతో బ్రతకడం

విశ్వప్రభువు మానవుడ్ని సృష్టించాడు. అతనికొక ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు. పుడమిపై తన ప్రతినిధిగా నియమించాడు. ప్రపంచంలోని వస్తువుల్ని అనుభవిస్తూ సవ్యంగా బ్రతకమన్నాడు. అలాంటప్పుడు ఇతరుల ముందు చెయ్యి చాపడం మానవులకు తగదు! ప్రతివారూ తమ గౌరవమర్యాదల్ని మానమర్యాదల్ని నిలుపుకుంటూ జీవించాలని మహా ప్రవక్త (సఅసం) తన సహచరులకు ఆదేశించారు. వారు ఆ ఆదేశాలను శిరసావహించి ఆదర్శమూర్తులుగా తమ వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకున్నారు.

ఒకప్పటి విషయం. కొందరు విశ్వాసులు మహాప్రవక్త వద్దకు వచ్చారు. వారంతా అప్పుడే ఇస్లామ్ స్వీకరించినవారు, ముస్లిమ్ సమాజంలో అడుగుపెట్టారు, వారికెన్నో హితబోధలు చేశారు మహాప్రవక్త (సఅసం). "ఎవరూ ఎవరివద్దనయినా చెయ్యిజాచి అడుగరాదు" అని కూడా ఆదేశించారు.

మహాప్రవక్త ఆదేశాలన్నింటినీ శిరసావహించి ధర్మం ప్రకారం జీవిస్తున్న విశ్వాసులు ఒంటె మీద స్వారీచేస్తూ వెళ్తున్నప్పుడు చేతిలోని కొరడా క్రిందపడినప్పటికీ, ప్రక్కనే కాలినడకన పోయే మిత్రుని చూచి "అయ్యా! కాస్త ఆ కొరడాను చేతికందివ్వు" అని కూడా అడిగేవారుకారు వారు.

ఒకనాటి సంఘటన. హజ్రత్ అబూబక్ర్ (రజి) మహా ప్రవక్త (సఅసం) అనుచరులలో అగ్రగణ్యులు. మిత్రులతో కలిసి ఎక్కడికో వెళుతున్నారు. ఒంటె మీద కూర్చుని స్వారీ చేస్తున్నారు. అకస్మాత్తుగా చేతిలోని కళ్ళెం జారి క్రిందపడింది. హజ్రత్ అబూబక్ర్ ఒంటెను ఆపారు. దాన్ని కూర్చోబెట్టి క్రిందికి దిగారు. పడిపోయిన కళ్ళెం తీసుకున్నారు; ప్రయాణం సాగించారు. దగ్గర ఉన్నవారంతా ఈ దృశ్యం చూశారు. అందులో ఒకతను ఇలా అన్నాడు. "మహాశయా! మీరింత శ్రమ తీసుకోవలసిన అవసరమేముంది? మేమిక్కడే ఉన్నాం కదా! మాకొక మాట చెప్పి ఉంటే మేము కళ్ళాన్ని మీకందించే వాళ్ళం కదా!"

"చేతనయ్యే పనికై ఇతరుల ముందు అర్థించడం నిజ విశ్వాసికి శోభించదు. ఎవరినీ ఏమీ అర్థించకుండా జీవిస్తానని, ప్రవక్తకు మాటిచ్చాను" అని అన్నారు ఆత్మగౌరవం కాపాడుకొనే ఆదర్శ మహనీయులు హజ్రత్ అబూబక్ర్ (రజి).

# నిరాడంబరత

అతిథి సత్కారమనేది సంస్కారం గల సమాజపు సహజ లక్షణం. సాదాసీదాగా జరిగే సత్కారాలకు అతిథి సాధారణంగా సంతోషంగా సంతృప్తిగా ఉంటాడు. కొంతకాలం కులాసాగా మిత్రులతో గడపడానికి ఇష్టపడతాడు కూడా అలాకాకుండా వచ్చిన అతిథికి తీరిక లేకుండా ప్రతి చోటా, ఆడంబరాలతో నింపేస్తే, తాహతుకు మించిన సత్కారాలు చేస్తే అతిస్వల్ప కాలంలోనే అతిథి అక్కడి నుండి వెళ్ళిపోవాలనుకుంటాడు. మిత్రునితో కులాసాగా గడిపే అవకాశం లేకుండా పోతుంది.

బంధుమిత్రుల మధ్య వాత్సల్యం వ్యక్తం చేసే సంఘటనలు చరిత్ర పుటల నిండా ఉన్నాయి. కాని నిరాడంబరత అంటే ఏమిటో నేర్పే ఒక గురుశిష్యుల కథ విందాం:

చాచా సఅదీ గొప్ప పండితుడు. పర్షియన్ భాషలో మధురాతి మధురంగా కవిత్వం చెప్పేవాడు. ఈయన షీరాజ్ పట్టణ వాస్తవ్యుడు. కాని విద్యా దాహం తీర్చుకునేందుకు దూరదేశాల పయనం చేశాడు. దైవం మానవులకు ప్రసాదించిన అనేక భాషలు నేర్చుకున్నాడు. హిందూ దేశం లాంటి దూర దేశానికి వచ్చాడు. చూచిన ప్రాంతాలు, కలిగిన అనుభూతితో అనేక గ్రంథాలు రచించాడు. గులిస్తాన్, బూస్తాన్ అనే పుస్తకాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. పలు భాషలలో అనువదించబడ్డాయి కూడా. ఈనాటికీ ఆ పుస్తకాలు చదివి పరవశులయ్యే పాఠకులెందరో ఉన్నారు.

చాచా సఅదీ ఒకసారి ఒక పర్యటన జరిపారు. ఒక పట్టణం చేరుకున్నారు. పట్టణాలలో పండితుల స్నేహితులకు కొదువ ఉంటుందా? ఆయన చేరిన పట్టణంలో ఒక స్నేహితుడుండేవాడు. హోటళ్ళు లేని ఆ కాలంలో బంధుమిత్రులకు సత్కారం చేసే భాగ్యం మిత్రులకు లభించేది. వారికి కావలసిన వసతులు ఏర్పాటుచేసి పుణ్యం కట్టుకునేవారు. సరే, చాచా సఅదీ తన స్నేహితుని పిలుపును పురస్కరించుకుని అతిథిగా అతని ఇంటిలో బసచేశారు. సఅదీ పండితుడు సమాజంలో గౌరవ ప్రతిపత్తులు కలవాడు. ఆయనకు ఆతిథ్యం ఇవ్వడమంటే మహాభాగ్యంగా మిత్రులు తలంచేవారు. అంచేత సఅదీ స్నేహితుడు అన్ని ఏర్పాట్లు చేసి మరీ ఆహ్వానించాడు. వింతైన వంటకాలతో, నోరూరించే పదార్థాలతో విందు ఏర్పాటు చేశాడు. చాచా సఅదీ భోజనానికి కూర్చున్నాడు. వడ్డించిన పదార్థాలను చూస్తూనే,

“ఆహా! షీరాజ్ విందు!!” అని అన్నాడు. మిత్రునికి ఆశ్చర్యం కలిగింది. షీరాజ్ పట్టణంలో విందు ఇంతకన్నా ఘనంగా ఉంటుందేమో అని భావించాడు. అంచేత రెండవ దినం ఆయన మరింత శ్రద్ధ తీసుకుని పంచభక్ష్య పరమాన్నాలు తయారుచేయించి వడ్డించాడు. యథాప్రకారం చాచా సఅదీ భోజనానికి కూర్చుని-

“ఆహా! షీరాజ్ విందు!!” అని మళ్ళీ అన్నాడు. స్నేహితుడు తన కోసం ఎంత శ్రద్ధ తీసుకుంటున్నాడో చాచా సఅదీ గ్రహించాడు. ఈ మిత్రుని ఇంట్లో

ఉంటే అతనికి మితిమీరిన శ్రమ కలిగించినట్లవుతుందని భావించాడు. ఇక ఆలస్యం చెయ్యకుండా అక్కణ్ణుంచి బయల్దేరాడు.

కొంత కాలం గడిచింది. చాచా సఅదీ స్నేహితుడు షీరాజ్ పట్టణానికి వచ్చాడు. ఇంకేముంది నేరుగా సఅదీ ఇంటికి వచ్చాడు. "షీరాజ్ విందు" ఎలా ఉంటుందో చూద్దామని పెద్ద ఆశ పెట్టుకున్నాడు. చాచా సఅదీ స్నేహితునికి స్వాగతం పలికాడు. తనకు కలిగిన అమితోత్సాహం, ఆనందం వ్యక్తపరిచాడు. ఇక భోజన సమయం రానేవచ్చింది. చాచా సఅదీ ఇంటిలో రోజూ చేసే రొట్టెలు, ప్రతి దినం వండే పప్పు వడ్డించాడు. "బిస్మిల్లాహ్" (అల్లాహ్ పేరుతో) కానీయండి అని అన్నాడు. తానూ తిన్నాడు. అతిథికి తినిపించాడు.

చాచా సఅదీ మిత్రుడు ఆశ్చర్యపడ్డాడు. ఏదో చెప్పబోయాడు. చాచా సఅదీ మనస్తత్వాన్ని గ్రహించే వ్యక్తి కావడం వల్ల మిత్రునికంటే ముందే ఇలా అన్నాడు. "తమ్ముడూ, మీ ఊరు వచ్చినప్పుడు భోజన సమయంలో 'ఆహా! షీరాజ్ విందు!!' అని అన్నాను. అదే కదా నీ సందేహం? ఎందుకో తెలుసా? ఆతిథ్యం నిరాడంబరంగా ఉండాలి. వచ్చిన వ్యక్తి ఎన్ని దినాలున్నా ఆతిథ్యమిచ్చే వ్యక్తికి ఏ మాత్రం శ్రమ కలగరాదు. నీవు చేసిన ఏర్పాట్లు ఘనంగా ఉండేవి. అది చూచి నేను మొహమాటపడ్డాను. అంచేత మీ ఊరిలో ఇంకా ఉండదలచినా అక్కడ ఉండలేకపోయాను."

నిరాడంబర జీవితం విశ్వాసానికి చిహ్నం. నిష్కల్మష మనస్సుతో, ప్రేమ పూరిత హృదయంతో అతిథుల్ని గౌరవిస్తే చాలు. అదే నీకు మహాభాగ్యం చేకూరుస్తుంది. పేరుప్రతిష్టల కోసం ప్రాకులాడుతూ పలువిధాలా వృధా ఖర్చుపెట్టినా ఫలితం మాత్రం శూన్యం.

# పాలకుల కర్తవ్యం

హజ్రత్ ఉమర్ ఖలీఫాగా ఉన్న కాలం. ప్రజల పరిస్థితులను తెలుసుకోవడం, వారి కష్టాలను తొలగించడం ఖలీఫా కర్తవ్యం. ఈ బాధ్యతను హజ్రత్ ఉమర్ ఎంతో చిత్తశుద్ధితో నెరవేర్చారు. ఆయన పగలంతా కష్టపడి పరిపాలనా వ్యవహారాలను చూసుకునేవారు. రాత్రుల్లో విశ్రాంతి, విరామం లేకుండా

పురవీధుల్లో గస్తీ చేస్తూ ప్రజల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకునేవారు.

ఒకనాటి రాత్రి సమయం. హజ్రత్ ఉమర్ మామూలు ప్రకారం పట్టణ వీధుల్లో గస్తీ చేస్తున్నారు. దాదాపు ఊరి చివరి వరకు వెళ్ళారు. తిరిగివస్తున్న సమయంలో ఒక పూరి గుడిసె ఆయన కంటబడింది. ఆ గుడిసెలో పొయ్యి వద్ద కూర్చుని ఒకామె వంట చేస్తున్నట్లుంది. పొయ్యిపై కుండ అగుపిస్తుంది. పాపం పసిపిల్లలు ఆమె చుట్టూ చేరి విలవిల్లాడుతున్నారు. ఆమె వారిని బుజ్జగిస్తూ ఓదార్చుతోంది. ఎంతసేపటికి పిల్లలు ఏడ్వటం మానలేదు. హజ్రత్ ఉమర్ ఈ దృశ్యాన్ని చూశారు. ఆయన హృదయం ద్రవించింది. "ఏమిటి సంగతి! ఇంత రాత్రివేళ వంట వండడం, పసికందులు విలపిస్తుండడం, దీనావస్థలో దిక్కులు చూస్తూ స్త్రీ అలా కూర్చోవడం! పిడికెడు అన్నం కూడా ఎవరికీ పెట్టకపోవడానికి కారణం? " అని తలపోస్తూ అసలు విషయాన్ని తెలుసుకునేందుకు ఆమెను పిలిచి అడిగారు ఖలీఫా. "ఏమమ్మా! పిల్లలు ఎందుకేడుస్తున్నారు?" "అబ్బే ఏమీ లేదండి! ఆకలి బాధ వల్ల వారలా ఏడుస్తున్నారు" అందామె. "మరి ఆలస్యమెందుకు? భోజనం వడ్డించి వారిని ఓదార్చలేకపోయావా తల్లీ! నీ వంటను నేను గమనిస్తూనే ఉన్నా. పొయ్యి మీద పెట్టిన కుండ దించడమంటూ జరగడం లేదు. భోజనం తయారు చేయడానికి ఇంతసేపవుతుందా!" అని అడిగారాయన.

"కుండలో ఏమీ లేదండి!" అని ఆమె జవాబు చెబుతూ తన హృదయా వేదనను ఆపుకోలేక పోయింది. ఎంతో దీనంగా మండే గుండెల గాథ వినిపించింది. "అయ్యా! ఇంటిలో తినడానికి ఈ పూట ఏమీ లేదు. కాసిని నీళ్ళు కుండలో పోసి పొయ్యి మీద పెట్టాను. అన్నం ఉడుకుతుందని పిల్లలకు నచ్చచెబుతున్నాను. కొద్దిసేపయితే వారే నిద్రపోతారు. అంతకంటే నేనేం చేయలేను" అందామె.

సంగతి గ్రహించారు ఖలీఫా. పిల్లల బాధ ఆయన హృదయాన్నే కలచివేసింది. తండ్రిని కోల్పోయిన పిల్లలతో భరింపరాని బాధలనుభవిస్తోంది ఆ గృహిణి అని అర్థం చేసుకొన్నారు. ఉబికివస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ "తల్లీ! ఇంతకు మీ పరిస్థితిని ఖలీఫాకు తెలుపకపోవడానికి కారణం?" అని అడిగారు. దుఃఖంతో కుమిలిపోతూ "మాకూ ఖలీఫాకు మధ్య తీర్పు చేసేవాడు అల్లాహ్ ఉన్నాడు. నేనా ఒక అనాథను. ఎవరితో ఏమని చెప్పుకుంటూ వెళ్ళనూ?

ప్రజల కష్టసుఖాలను గుర్తించే బాధ్యత ప్రజలను ఏలే పాలకులదే గదా! ఆపాటి ధర్మం నెరవేర్చే శక్తిలేకుంటే ఖలీఫా పదవిని ఆయన ఎందుకు స్వీకరించాలి?" అన్నదామె.

ఆమె మాటలు పిడుగులా పనిచేశాయి. వెంటనే ఖలీఫా పరుగెత్తి ప్రభుత్వ ధనాగారం చేరారు. ఆ కాలంలో ప్రభుత్వ ధనాగారాలు సకల వస్తువులతో నిండి ఉండేవి. పిండి, వెన్న, ఖర్జూరపు పండ్లు ఇత్యాది పదార్థాలు, ఇంకా కొంత ధనం తీసుకొని వాటన్నిటినీ వీపుపై మోసుకుంటూ బయలుదేరారు. వెంటనున్న నౌకరు ఇదంతా చూస్తూ ఆశ్చర్యపోయాడు. "ఖలీఫా గారూ! ఈ శ్రమ మీకెందుకు, దాన్ని ఇటివ్వండి. నే తీసుకెళ్ళి ఆవిడ ఇంటికి చేరుస్తానన్నాడు."

"వీల్లేదు నాయనా! వీల్లేదు, ప్రళయ దినాన నా భారాన్ని నువ్వు మోస్తావా? ఈనాడు నా భారాన్ని నీకిస్తే ఆనాడు నా సంగతేమవుతుంది?" అన్నారాయన.

ఆ పదార్థాలు తీసుకెళ్ళి స్వహస్తాలతో ఆ తల్లీబిడ్డలకు వండి పెట్టారు ఖలీఫా. మరలి వెళుతుంటే, "ఖలీఫాగా ఉండవలసింది నీవే నాయనా, ఆ ఉమర్ కాదు" కృతజ్ఞత తెలుపుకుంటూ కంటతడి పెట్టుకుంటూ అన్నదామె.

"అమ్మా! ఇంతవరకు మీ కష్టాలను తెలుసుకోలేకపోయిన ఆ ఉమర్‌ని నేనే, తీరని తప్పు చేశాను మన్నించాలి" అన్నారు ఖలీఫా. మరుసటి దినమే కావలసినంత పింఛను మంజూరు చేసి ఆ కుటుంబం పట్ల తన బాధ్యత నెరవేర్చారు.

# తండ్రి త్యాగం

కాకి పిల్ల కాకికి ముద్దట! బిడ్డల పట్ల ప్రేమానురాగాలు తల్లిదండ్రులకు సహజంగానే ఇచ్చాడు దైవం. కూలినాలి చేసుకునే శ్రమజీవులు కానివ్వండి, రాజాధిరాజులు కానివ్వండి. తమ సంతానం పట్ల ప్రేమ అందరికీ ఉంటుంది. పిల్లలకు జ్వరం వచ్చినా, దెబ్బతగిలినా, కష్టాలు కలిగినా వారికంటె వారి తల్లిదండ్రులే ఎక్కువ బాధపడతారు. బిడ్డలకు కలిగిన కష్టాన్ని తొలిగించేందుకు తల్లిదండ్రులెంత త్యాగానికయినా సంసిద్ధులవుతారు.

భారత దేశాన్ని మొగల్ పాదుషాలు ఎన్నో ఏండ్లు పరిపాలించారు. అసలు భారత దేశంలో మొగలు సామ్రాజ్యాన్ని స్థాపించిన చక్రవర్తి బాబర్. ఇతని కుమారుని పేరు హుమాయూన్. హుమాయూన్‌ని బాబర్ గాఢంగా ప్రేమించేవాడు.

ఒకనాటి సంఘటన. హుమాయూన్ ఆరోగ్యం చెడింది. అస్వస్థత దినదినానికి అతన్ని దహించివేస్తుంది. ఆ సమయంలో హుమాయూన్ "సంభల్" పట్టణంలో ఉన్నాడు. బాబర్ వెంటనే అతణ్ణి ఆగ్రాకు పిలిపించాడు. ప్రయాణంలో ఇసుమంత కూడా కష్టం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశాడు. కాని ఆగ్రా చేరుకునేలోగా హుమాయూన్ పరిస్థితి మరింత తీవ్రమయింది. యునానీ వైద్యులు, ఆయుర్వేదాచార్యులు హుమాయూన్ చికిత్స కోసం రేయింబవళ్ళు ప్రయత్నం చేశారు. కాని లాభం కానరావడం లేదు. "ప్రభూ! ఇక ఆశ లేదు" అని పాదుషాకు విన్నవించుకున్నారు. బాబర్ భరించరాని దుఃఖంతో తల్లడిల్లిపొయ్యాడు. క్షీణించిపోతున్న కుమారుని ఆరోగ్యం, మరోవైపు కుమిలి కృశించిపోతున్న తండ్రి. రాజుగారి పరిస్థితి చూచి రాణిగారు స్వయంగా కొడుకు అనారోగ్యం వల్ల ఏర్పడిన బాధనంతా మరచిపోయింది. రాజుగారిని ఓదార్చడానికి ప్రయత్నించింది. ఎందుకిలా గాభరాపడుతున్నారు, మీకింకా కొడుకులున్నారు కదా! మీరేమో రాజులాయె. పరిపాలకులు ఇలా ఆవేదన చెందడం శ్రేయస్కరం కాదు.

బాబర్ చక్రవర్తి ఇలా అన్నాడు, "రాణీ, నువ్వు చెప్పేది వాస్తవమే, నేను నిశ్చయంగా పాదుషానే. కాని నేనొక తండ్రిని కూడా. తనయుని ఆరోగ్య పరిస్థితి ఇలా ఉంటే ఎలా భరించగలను?"

హుమాయూన్ పరిస్థితి విషమించింది. బ్రతుకుతాడన్న ఆశ వదులుకోవాల్సి వచ్చింది. బాబర్ తన పరివారాన్ని పిలిపించి ఇలా అన్నాడు: "హుమాయూన్ గురించి ఇప్పుడేం చేయగలం?" అనేకులు రకరకాల సలహాలిచ్చారు. అందులో ఒకాయన ఇలా అన్నాడు. "మీకు అత్యంత ప్రియమైన వస్తువుని కుమారుని పేర త్యాగం చెయ్యండి. అల్లాహ్ అనుగ్రహమయితే మీ కొడుకు బ్రతకవచ్చు" బాబర్‌కు ఈ సలహా నచ్చింది. నా ధనాగారంలో ఉన్న విలువయిన వస్తువేది? నేను తప్పకుండా దాన్ని దైవం పేరిట త్యాగం చేస్తానన్నాడు. వజ్రవైఢూర్యాలు, బంగారు నాణేలు బీదసాదలకు దానం చెయ్యండి అన్నారు ప్రజలు. కాని ఆ సలహా ఏమీ

నచ్చలేదు బాబర్‌కు, ఆలోచించాడు. నాకు అన్నిటికంటే ప్రియమయినది నా ప్రాణమే. కొడుకుకు మారుగా నాప్రాణం నేను త్యాగం చెయ్యాలి.

ఈ నిర్ణయం తీసుకొని రాజు ఉపవాసం ఉన్నాడు. దైవాన్ని మనసారా అర్థించాడు. చిత్తశుద్ధితో హుమాయూన్ ఉన్న గదిలో ప్రవేశించాడు. రోగి పడుకున్న మంచం చుట్టూ 3 పర్యాయాలు ప్రదక్షిణం చేస్తూ ప్రతి మారు ఎంతో భక్తితో ఎంతో వినమ్రతతో దైవాన్ని అర్థించాడు: "ఓ దైవమా! నా బిడ్డకు ప్రాణ భిక్ష పెట్టు. దానికి మారు నా ప్రాణం తీసుకో." అల్లాహ్ ఆయన ప్రార్థనను ఆలకించాడు. హుమాయూన్ రానురాను ఆరోగ్యవంతుడయ్యాడు. మరో వైపు బాబర్ ఆరోగ్యస్థితి దిగజారసాగింది. అదే వ్యాధితో ఆయన దివంగతుడయ్యాడు. చూశారా! తనయుని కోసం తండ్రి చేసిన త్యాగం.

## త్యాగంలో తృప్తి

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తర్వాత ఇస్లామ్ ధర్మానుసారం రాజ్యపాలన చేసి ప్రథమ ఆదర్శ ఖలీఫాగా పేరు పొందినవారు హజ్రత్ అబూబక్ర్ (రజి). ఈయన విశ్వాసంలోనూ అగ్రగణ్యుడయిన మహాపురుషుడు. ఎల్లప్పుడు దైవ భయంతో జీవితం గడిపిన పుణ్యజీవి. నిరాడంబరంగా జీవించటంలో ఆయనకు ఆయనే సాటి. దైవ మార్గంలో ఆయన చేసిన త్యాగం అనన్యం.

హజ్రత్ అబూబక్ర్ (రజి) ఖలీఫా బాధ్యత స్వీకరించే ముందు గొప్ప వ్యాపారి. ఆయన బట్టల వ్యాపారం చేసేవారు. స్వయంగా నగర వీధుల్లో తిరిగి బట్టలు అమ్మేవారు. తరువాత ఖలీఫాగా రాజ్యభారం వహించి తన విధుల్ని చక్కగా నిర్వహిస్తూ దాంతోపాటు జీవిక సాగించడానికి బట్టల మూట నెత్తిన పెట్టుకొని కాస్తో కూస్తో సంపాదించుకునేవారు. కాని పరిపాలనా భారం వహిస్తూ వ్యాపారం నడపడం సాధ్యమవుతుందా? ధర్మజ్ఞుల సలహా ప్రకారం ధనాగారం నుండి కొద్దిపాటి వేతనం ఆయనకు నిర్ణయమయింది. ఆ డబ్బుతో ఖలీఫా తన కుటుంబాన్ని పోషించుకునేవారు. అతి సాధారణ ఖర్చులతో జీవితం గడిపేవారు.

"జీవితంలో కోరికలనేవి లేకుండా ఉండటం సాధ్యంకాదు" హజ్రత్ అబూబక్ర్ సతీమణికి ఓనాడు చిన్న కోరిక కలిగింది. మిఠాయి చేసుకొని

తిందామనుకున్నదామె. భర్త ఇంటికొచ్చాక "అమీరుల్ మోమినీన్! ఈ పూట ఏదయినా తీపి పదార్థం వండుకుని తిందామని ఉంది. పంచదార తెప్పిస్తే మిఠాయి చేస్తాను" అన్నదామె. ప్రభుత్వం నుండి లభించే స్వల్ప ఆదాయం ఇలాంటి కోరికలు తీర్చడానికి సరిపోదు. అంచేత "పంచదారకు నా వద్ద పైసలు లేవు" అని అనేశారాయన. ఇక చేసేదేమీ లేక ఆమె మౌనం వహించారు.

కొన్ని దినాలు గడిచాయి. ప్రభుత్వం నుండి వచ్చే డబ్బులో ఎంతో కొంత పొదుపు చేసి డబ్బు మిగిల్చారు ఖలీఫా సతీమణి. ఆ పైసలతో పంచదార తెప్పించారు. తియ్యటి మిఠాయి చేసి ప్రీతితో పతికి వడ్డించారు. ఖలీఫాకు ఆశ్చర్యం కలిగింది. "మిఠాయి చేయడానికి పంచదార ఎలా వచ్చింది? ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?" అని అడిగారాయన. ఆమె ఉన్న విషయం చెప్పారు. "ఎన్నాళ్ళ నుండో పొదుపు చేసి కొన్ని పైసలు మిగిల్చాను. ఆ పైసలతో పంచదార తెప్పించాను." "ఏమిటి! ప్రభుత్వం నుండి వచ్చే ధన సహాయంలో పొదుపు చేయడానికి వీలుపడిందా? ఇలా పొదుపు చేస్తున్నప్పటికీ ఇంటిలో ఇబ్బంది లేకుండా గడిచిపోయిందా? అంటే ఆ వచ్చే ఆదాయం మన రోజువారీ ఖర్చులకుపోగా మిగల గలదన్నమాట! ఈ పైసలు ప్రభుత్వం నుండి అదనంగా తీసుకొన్నట్లే" అని ఆలోచించి ఆ ప్రకారమే మిగులుతున్నమేరకు తన వేతనాన్ని తగ్గించుకున్నారు. పాలకులు ఆదర్శవంతంగా ఉన్నప్పుడే పాలితులు తృప్తికరమైన జీవితాన్ని గడుపగలుగుతారు.

# శాంతి స్థాపనకు ఆదర్శం

6వ శతాబ్దంలో ఇస్లామ్ అవతరణకు పూర్వం అరేబియా దేశం అరాచకానికి ఆలవాలమయి ఉంది. చీటికిమాటికి ప్రజలు పోట్లాడుకునేవారు. కలహాలు, కలతలు ఆ మూఢ జనులకు మామూలయిపోయింది. ఎవరయినా హత్య చేయబడ్డారంటే పర్యవసానంగా ఇరువర్గాల మధ్య యుద్ధమే జరిగేది. ఒకసారి మొదలయిందంటే ఏండ్ల తరబడి సాగేది. సమాజంలో శాంతి సుఖాలు కరువయ్యేవి. యుద్ధాలలో మరణించినవారి సతీమణులు దౌర్భాగ్య జీవితం గడిపేవారు. సామాజిక సమస్యలు ఎన్నో తలెత్తేవి. ఎల్లప్పుడూ ప్రజలు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని జీవించే

వారు. ఏ క్షణంలో ఎవరికి ముప్పు మూడుతుందో చెప్పడం సాధ్యం కాకుండా ఉండేది. భార్యాపిల్లలకు భద్రత లేదు. బంధువులు సురక్షితంగా ఉంటారనే నమ్మకం లేదు. బలహీనులు బలవంతుల చేతుల్లో పడి హింసకు గురయ్యేవారు. బానిసల సంగతి సరేసరి. వారినంతా పశువులుగా చూసేవారు.

అలాంటి అరేబియాలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) జన్మించారు. ఆయన ఇంకా దైవప్రవక్తగా నియుక్తులు కాలేదు. కాని మహాప్రవక్త ప్రారంభం నుండే సమాజ సంస్కరణకు కృషి చేసేవారు. సమాజంలో అరాచకం తలెత్తకుండా ఉండేందుకు సందర్భానుసారం ప్రయత్నాలు చేసేవారు. శాంతి భద్రతలు సమాజానికి పునాది రాళ్ళు. అంచేతనే "హజరె అస్వద్" (నల్లరాయి)ను 'కాబా' గోడలో అమర్చే సందర్భాన మక్కా పట్టణంలో నాలుగు పెద్ద తెగల మధ్య ఏర్పడిన తగవును ఎంతో నైపుణ్యంతో మహాప్రవక్త పరిష్కరించారు. ఖురైషు తెగకు చెందిన సర్దార్లు తామే గొప్పవారమని, అంచేత "హజరె అస్వద్"ను దైవ గృహం గోడలో అమర్చేందుకు తామే అర్హులని, మరొకరు కాదని కత్తులు ఒరల నుండి లాగి యుద్ధ జ్వాలలు వ్యాపింపజేసే సమయంలో ముహమ్మద్ (సఅసం) ఆ ఆవేశ జ్వాలల్ని ఆర్పి మానవ రక్తం చిందకుండా కాపాడారు. చదరపు దుప్పటిపై ఆ నల్లరాయి పెట్టి తెగల నాయకుల్ని పిలిపించి దుప్పటి నాలుగు మూలలు పట్టి రాతిని పైకి లేవనెత్తమన్నారు. ఒప్పందం ప్రకారం స్వయంగా హజరె అస్వద్‌ను కాబా గోడలో అమర్చారు. మక్కా పట్టణాన్నే దహించివేసే సమస్యను శాంతి మార్గంలో సవ్యంగా పరిష్కరించారు.

అదే సమయంలో మరో సంఘటన జరిగింది. విదేశీ వ్యాపారస్థుడొకడు మక్కా పట్టణం వచ్చాడు. వ్యాపార వస్తువులెన్నో తెచ్చాడు. అవి చూచి అక్కడి ప్రజలకు నోళ్ళూరాయి. తిన్నగ వచ్చారు, చేజిక్కిన వస్తువుల్ని తమ ఇండ్లకు తీసుకెళ్ళారు. ఖరీదు చెల్లించేది లేదన్నారు. పాపం ఆ వ్యాపారి ఒంటరి మనిషి, నిస్సహాయుడు కంటికగుపడ్డ వారినందరినీ న్యాయం చేయమని బ్రతిమాలాడు. ఎత్తుకుపోయిన వస్తువుల ఖరీదు ఇప్పించమని విలపించాడు. కాని ప్రయోజనం లేకపోయింది. చివరకు ఈ సమస్య ముహమ్మద్ (సఅసం) వరకు వచ్చింది. పాపం పరదేశీయుడు, దౌర్జన్యపరుల చేతిలో పడి మోసపోయాడు. తెచ్చిన వస్తువులన్నీ కోల్పోయాడు. వస్తువుల ఖరీదు రాబట్టుకోవడానికి ప్రయాసపడు

తున్నాడు. ముహమ్మద్ (సఅసం) కు ఆయనపై జాలివేసింది. దౌర్జన్యానికి గురయిన దీనుని రక్షించే ఉపాయం యోచించారు.

ఎంత చెడినా సమాజంలో కొందరయినా శాంతికాముకులుంటారు, సంఘ శ్రేయోభిలాషులుంటారు. అలాంటి సచ్ఛీలురు ఒక ఒప్పందం మీద రాజీ పడ్డారు. ఆ ఒప్పందాన్ని "హిల్ఫుల్ ఫుజూల్" అనంటారు. ప్రయాణీకులపై జరిగే దౌర్జన్యం, బీదలపై వచ్చిపడే కష్టాలు, అనాథలు అనుభవించే బాధలు, పరదేశీయులు ఎదుర్కొనే పక్షపాతం లాంటి సామాజిక రుగ్మతల్ని వివిధ తెగల నాయకులకు మహాప్రవక్త (సఅసం) వినిపించేవారు, వాటి నిర్మూలనకు సమాలోచనలు జరిపేవారు. ఈ ఒప్పందంపై బనూ హాషిమ్, బనూ అబ్దుల్ ముత్తలిబ్, బనూ అసర్, బనూ జహ్రా, బనూ తమీమ్ తెగలవాళ్ళు సంతకాలు చేశారు. వారంతా ఒక పథకం రూపొందించారు. పథకంలోని వారి ఆశయాలు:

(1) దేశంలోని అశాంతిని దూరం చేస్తాం.

(2) ప్రయాణీకులకు ప్రాణరక్షణ కల్పిస్తాం.

(3) బీదలకు, బలహీనులకు, బాధితులకు సహాయం అందజేస్తాం.

(4) బలవంతులు బలహీనులపై దౌర్జన్యం చేయకుండా చూస్తాం.

ఈ ఆశయాలకు అంకితమయిన ఆ ఒప్పందం చేసుకున్న పెద్ద మనుషులు ప్రజలకు మేలు కలుగజేయడానికి ప్రముఖ పాత్ర వహించారు. దేశంలోని అరాచకం కొంతవరకు తగ్గింది. ప్రజల ధన మాన ప్రాణాలకు రక్షణ సమకూరింది. ప్రారంభం నుండి శాంతికై సమరం సాగించిన ముహమ్మద్ (సఅసం) ప్రవక్తగా నియుక్తులయిన తర్వాత కూడా ఈ ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ "నేను ఈ దినం కూడ అలాంటి ఒప్పందంలో చేరడానికి సిద్ధంగా ఉన్నాను" అని అనేవారు.

# ఓర్పు

మహాప్రవక్త (సఅసం) సహచరులు గుణవంతులు. ప్రళయం వరకు మానవులందరికీ ఆదర్శనీయులు. జీవిత గమనంలో ఎదురయ్యే ఒడిదుడుకుల్లో మనందరికీ వారి జీవిత విశేషాలు గుణపాఠం నేర్పుతుంటాయి.

ఆ మహనీయులలో అబూతల్హా (రజి) ఒకరు. ఆయన ధర్మపత్ని సదాచార సంపన్నురాలు, ఉత్తమ ఇల్లాలు. ఆ పుణ్య దంపతులకు ఒక పుత్రుడు కలిగాడు. ఆ బాలుడు ఎంతో అందమయినవాడు. తల్లిదండ్రుల కనులవిందయినవాడు, కాని విధి ఒకరి వశమా! అంతా మన మనోభిలాషల ప్రకారం జరుగుతుందా? పసిపిల్లవాడికి జబ్బు చేసింది. ఎన్ని మందులు వాడినా నయం కాలేదు. ఓ రోజు పరమపదించాడు. ఆ సమయంలో అబూతల్హా ఇంటిలో లేరు.

పసిపిల్లలు మరణిస్తే మాతృ హృదయం తల్లడిల్లిపోతుంది. అబూతల్హా సతీమణికి కలిగిన దుఃఖం చెప్పనలవికానిది. కాని ఆ తల్లి సహనమూర్తి. దైవం ఇచ్చిన ప్రతిదానికి దైవం పట్ల మనసారా కృతజ్ఞత తెలుపుకొనే స్వభావం కల మహిళ. బాలుని మృతి వల్ల కలిగిన బాధను దిగమ్రింగింది. వెంటనే మృత దేహానికి గుసుల్ (స్నానం) చేయించి, కఫన్ తొడిగించి ఉంచింది. ఆ తరువాత యథాప్రకారం ఇంటి పనుల్లో నిమగ్నమైపోయింది.

బయటకు వెళ్ళిన అబూతల్హా (రజి) ఎంతో ప్రొద్దుపోయాకగాని ఇంటికి రాలేదు. ఇంటిలో కాలుపెట్టి పెట్టగానే పిల్లవాని క్షేమసమాచారం దర్యాప్తు చేశారు. భర్తకు ఉన్న సమాచారం తెలుపక ఏదో విధంగా సమాధానపరిచింది. ఆ మీదట మామూలుగా భోజనం వడ్డించింది. భోజనం అయ్యాక, ఇరువురు కూర్చొని సంభాషించుకొన్నారు.

గృహిణి: "ఏమండి! ఎవరయినా భద్రంగా కొంత కాలం దాచి ఉంచమని ఏదయిన (అమానతు) మీకు అప్పగించారనుకోండి. గడువు పూర్తయ్యాక ఆ సొమ్మును తీసుకెళ్ళడానికి యజమాని వచ్చినప్పుడు ఆ సొమ్మును ఇవ్వడానికి నిరాకరిస్తే బాగుంటుందా?"

అబూతల్హా: "అదెలా సాధ్యం? అమానత్‌ను ఇవ్వమని కోరితే యజమానికి ఆ సొమ్ము వాపసు చేసి తీరాల్సిందే."

ఈ మాటల్ని విన్న అబూతల్హా సతీమణి తృప్తిగా నిట్టూర్చింది.

"మరేమీ లేదు, చూడండి. నిత్యం ఉల్లాసంగా ఉరకలు వేసే మన ముద్దుల అబ్బాయి కూడా మన ప్రభువు మన చేతుల్లో పెట్టిన అమానతే. ఇప్పుడా ప్రభువు

ఆ అమానత్‌ను తిరిగి తీసుకొనివెళ్ళాడు. ఓర్పు వహించి బాలుని అంత్యక్రియలు చేయండి" అన్నదామె మెల్లగా.

అబూతల్హా (రజి) ముందు విస్తుపోయారు. కాని తరువాత భార్య కనబరచిన విజ్ఞతకు పొంగిపోయారు.

నిశ్చల మనసుతో ధైర్యంగా పిల్లవాని అంత్యక్రియలు పూర్తిచేసి మహాప్రవక్త (సఅసం) సమక్షంలోకి వచ్చారు. జరిగిన వాస్తవాన్ని పూసగుచ్చినట్లు చెప్పారు. భార్యాభర్తలు కనబరచిన ఓర్పు మహా ప్రవక్త (సఅసం)కు ఎంతో నచ్చింది. వెంటనే వారిరువుర్ని ఆశీర్వదించి వారికై దేవుణ్ణి ప్రార్థించారు.

కొన్ని నెలలు గడిచాయి. ఆ పుణ్యదంపతులకు మరొక పిల్లవాడు కలిగాడు. అబ్దుల్లా (రజి) అనే పేరు పెట్టి ఆ అబ్బాయిని ఎంతో గారాబంగా పెంచారు. పిల్లవాడు ఆ ఆదర్శదంపతుల ఒడిలో పెరిగి పెద్దవాడై, విజ్ఞానవంతుడై ప్రపంచంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించాడు. తల్లిదండ్రుల కీర్తి నలుదిశల వ్యాపింపజేశాడు. ఆ ఆదర్శ తల్లిదండ్రుల ఆదర్శ సంతానం అనిపించుకున్నాడు.

# పొరుగువారి పట్ల బాధ్యత

ఈరాన్‌లో జీలాన్ అనే పట్టణం ఉంది. ఆ పట్టణంలో ఒక మహనీయులు ఉండేవారు. ఆయన పేరు షేక్ అబ్దుల్ ఖాదిర్, ఆయనను హజ్రత్ జీలానీ అని కూడా పిలిచేవారు. ఆయన నిష్ఠాపరుడయిన ధార్మిక జీవి. హజ్రత్ జీలానీ పొరుగున ఒక యూదుడు ఉండేవాడు. అతనికొక దుష్ట గుణం ఉండేది. ఎప్పుడూ పొరుగువారిని బాధించేవాడు. జీలానీ దైవారాధన (నమాజ్) చేస్తున్నప్పుడు, ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నప్పుడూ ఆ యూదుడు మేళాలను వాయిస్తూ అల్లరి చేసేవాడు. సంగీతం తెలియకపోయినా రాగాలాపం చేసేవాడు. హజ్రత్ జీలానీని ఎలాగయినా రెచ్చగొట్టి జగడం సృష్టించాలనుకున్నాడు. రాను రాను యూదుని దుర్మార్గాలు మితిమీరిపోయాయి, అయినప్పటికీ పల్లెత్తు మాట అనేవారు కారు ఆ షేఖ్.

ఒక దినం ఏదో కారణం వల్ల రక్షక భటులు యూదుణ్ణి పట్టుకొన్నారు. కారాగారంలో పడేశారు. షేఖ్ జీలానీకు ఆ వార్త తెలియదు. ఓ రెండు రోజులు

గడిచాయి. ప్రతి దినం నమాజ్ చేసే సమయంలో, ఖుర్ఆన్ పఠించే సందర్భంలో వినవస్తున్న ధ్వనులు హజ్రత్ జీలానీకి వినరాలేదు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఏమిటో కారణం అని షేఖ్ జీలానీ కాస్త ఆలోచించారు. విషయం వీధివారితో విచారించారు. "ఏముంది! తుంటరివాడు, నేరం చేశాడు. కారాగారంలో ఉన్నాడు. నేర విచారణ జరుగుతోంది" అని చెప్పారు. "పొరుగింటి వ్యక్తి ఆపదలో ఉంటే ఆ విషయాన్ని కూడా తెలుసుకోలేకపోయానా?" అని బాధపడ్డారు. షేఖ్ వెంటనే న్యాయస్థానం చేరారు. న్యాయాధిపతిని కలుసుకున్నారు. "మహాశయా! నా పొరుగున ఉన్న యూదుణ్ణి రక్షక భటులు పట్టుకుని కారాగారంలో పడేశారట. అతడు చేసిన నేరానికి జరిమానా చెల్లించాల్సి ఉంటే నేను చెల్లిస్తాను. వెంటనే ఆ వ్యక్తిని విడుదల చేయండి. ఇంకా అతని విషయంలో తీర్పుచేయక ఉంటే వెంటనే న్యాయవిచారణ జరపండి. యూదుడు విచారణలో నిరపరాధిగా రుజువు కావచ్చు కూడ. న్యాయ విచారణలో ఆలస్యం చెయ్యడం న్యాయ నిరాకరణకు సమానం" అని అన్నారు. న్యాయాధిపతి యూదుడు చేసిన నేరానికి సంబంధించిన పత్రాలు వెంటనే తెప్పించారు. విచారణ జరిపించారు. అనుకొన్నట్లే యూదుడు నిరపరాధిగా తేలాడు. అతనిపై మోపబడిన నేరం కొట్టివేశారు. యూదుడు కారగారం నుండి విడుదలయ్యాడు.

హజ్రత్ షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ ప్రవర్తన యూదునిలో ఒక విప్లవాత్మకమయిన మార్పు తెచ్చింది. ఇల్లు చేరిన వెంటనే అతడు షేఖ్ సమక్షంలో హాజరయ్యాడు. "ఓ మహాత్మా! నేను మిమ్మల్ని ఎంతో కష్టపెట్టాను. మీ ఆరాధనలో అంతరాయం కలిగించడానికి ప్రయత్నించాను. అల్లరి చేస్తూ మీకు మనశ్శాంతి లేకుండా చేశాను, అలాంటి నన్ను కారాగారంలో పడవేస్తే నా దుర్మార్గం వల్ల మీకు కలిగే నష్టం దూరమై ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఇలాంటి సమయంలో మీరు సంతోషపడడం పోయి మీరు నాపై కరుణించారు. మీ జోక్యం వల్ల విచారణ జరిగింది. నన్ను కారాగారం నుండి విడుదల చేశారు. మీరు చూపిన ప్రేమాదరణలకు నేను మీకెంతో రుణపడ్డాను. మరెన్నడూ మునుపటిలా ప్రవర్తించను. నన్ను క్షమించండి" అని ఆ యూదుడు తన తప్పులకు సిగ్గుపడి పశ్చాత్తాపం చెందాడు.

షేఖ్ ఔదార్యం చూడండి : "నాయనా! నీకు నేను చేసిన సహాయం ఏమీలేదు. ఆపదలందు ఉన్నవారిని ఆదుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. పైగా పొరుగింటివారి పట్ల ఉన్న బాధ్యతల్ని ఇస్లామ్ స్పష్టంగా పేర్కొన్నది" అని అన్నారు షేఖ్.

షేఖ్ అన్న మాటలు యూదుని హృదయ జగత్తును ప్రభావితం చేశాయి. ఇస్లామ్ సత్యధర్మమని, అది ఉత్తమ జీవన మార్గం చూపుతుందని ఆ యూదుడు గ్రహించాడు. వెంటనే ఇస్లామ్ స్వీకరించాడు. "అల్లాహ్ ఒక్కడే నా దైవం. ఆయన అనుగ్రహించిన ఇస్లామ్ నా జీవన విధానం" అని ప్రకటించాడు.

# ఆతిథ్యం

అతిథి సత్కారం అనేది ప్రతి సమాజంలోను ఉండే ఉత్తమ లక్షణం. ఆకలిదప్పులతో ఉన్నవారి సేవ చేయడం ఉన్నత నైతికతకు ప్రమాణం.కాని స్వయంగా లేమిని అనుభవిస్తూ ఇతరుల సేవ చేయడానికి ప్రయత్నించడం ఆదర్శ గుణం.

మహాప్రవక్త (సఅసం) ఇస్లామ్ సంస్థాపన కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారు. సహచరులలో చాలా మంది బీదవారున్నారు. ఒకనాడు ఓ వ్యక్తి బక్కపడ్డ శరీరంతో, ఎండిన పెదవులతో మహాప్రవక్త (సఅసం) తన సహచరులతో కలసి కూర్చున్న చోటికి వచ్చాడు. ఆ వ్యక్తి స్థితిని చూసి అందరికీ జాలి కలిగింది. "ఎవరయినా ఈ వ్యక్తికి ఈ పూట ఆతిథ్యం ఇవ్వండి" అని అన్నారు మహాప్రవక్త. ఆ బాధ్యత హజ్రత్ అబూతల్హా తీసుకున్నారు. అతిథిని ఇంటికి తీసుకువచ్చారు. భోజన పదార్థాలు వడ్డించమని ఇల్లాలిని కోరారు. "పసి పిల్లవాని కోసం కొద్దిగా అన్నం ఉంది. అంతకు మించి ఏమీ లేదు" అని ఆమె అన్నారు. అబూతల్హా ఒక ఉపాయం ఆలోచించారు. "పిల్లవాణ్ణి ఓదార్చి, ఉన్న ఆహారాన్ని తెచ్చి పెట్టమన్నారు. అతిథితో పాటు నేనూ కూర్చున్నాక దీపం ఆర్పేయ్. చీకటిలో ఏమీ కనబడదు కదా! ఉన్న అన్నం అతిథి తిన్న తరువాత మేము అతనితోపాటు లేవవచ్చు" అని అన్నారు అబూతల్హా, అనుకొన్నట్లే అతిథికి తినిపించి తాను మాత్రం కుటుంబ సమేతంగా పస్తు ఉండిపొయ్యారు.

ఉదయం హజ్రత్ అబూతల్హాను చూచి మహాప్రవక్త ఎంతో సంతోషం వ్యక్తపరుస్తూ "అబూతల్హా! గడచిన రాత్రి నీవు చూపిన అతిథి సత్కారం అల్లాహ్‌కెంతో నచ్చింది. ఈ విషయంలో 'ఆకలి బాధతో ఉన్నప్పటికీ వారు అతిథులకు తమపై ప్రాధాన్యమిస్తారు' అనే దివ్యఖుర్ఆన్ వాక్యం అవతరించిందని" అన్నారు. అందుకే ఆ మహనీయులు ప్రళయం వరకు విశ్వసించిన వారందరికీ ఆదర్శప్రాయు లయ్యారు.

# అప్పగింత - దాని భద్రత

ఇస్లామీయ సామ్రాజ్యాన్ని ఖలీఫా హజ్రత్ అలీ పరిపాలించే కాలం. ప్రభుత్వ ధనాగారంలో ధనం నిండుగా ఉండేది. ఆ ధనాగారాలలో ప్రజలు అమానతులు కూడ భద్రపరచుకునేవారు. ఓ దినం అందమయిన ఒక బంగారు ఆభరణం ధనాగారానికి అమానతుగా వచ్చింది. ముత్యాలు పొదగబడిన ఆ నగ నిగనిగలాడుతూ చూచేవారికి ఎంతో ఆకర్షణీయంగా ఉంది. హజ్రత్ అలీ కుమార్తెకు ఆ విషయం తెలిసింది. అప్పట్లో ఏదో పండుగ కూడా వచ్చింది. పండుగ పబ్బాలంటే స్త్రీలకు ఎంతో సరదా కదా! వస్త్రాలంకరణతోపాటు ఆభరణాలు కూడా ఉంటే బాగుంటుందని మహిళలు అభిలషిస్తారు. అలాగే ఖలీఫా పుత్రికకు ఒక తలంపు కలిగింది. ధనాగారం నుండి ఆ బంగారు హారం తెప్పించుకొని ఓ పూట వేసుకొని తిరిగి ఉన్నది ఉన్నట్లే ఇచ్చేద్దాం అని ఆమె తలచింది. కోశాధిపతికి కబురుచేసింది. ఆ ఉద్యోగి ఖలీఫా బిడ్డ మాటను కాదనలేక ఆభరణాన్ని మూడు దినాల గడువు మీద ఇచ్చాడు. రశీదు కూడా పుచ్చుకున్నాడు.

పండుగ రోజు ఎంతో సంతోషంగా ఆ నగను వేసుకొని మురిసిపోతుంది ఖలీఫా కుమార్తె. ఖలీఫా దృష్టి ఎలాగో ఆ నగపై పడింది. అది ప్రభుత్వ ధనాగారానికి భద్రపరచడానికి వచ్చిన అమానత్ (అప్పగింత) అని ఆయన గుర్తుపట్టారు. తన పుత్రికయినంత మాత్రాన ప్రభుత్వ ధనాగారంలోని అమానత్‌ను అనుభవించే హక్కు ఆమెకెలా వస్తుంది. బంగారు నగ తస్కరించబడింది అనే అనుమానంతో వెంటనే దర్యాప్తు జరిపించారు. షరీయత్ ప్రకారం సొమ్మును అపహరించేవారికి, వారెవరయినా సరే, హస్త ఖండనం తప్పదు కదా!

ఖలీఫా కుమార్తె అసలు విషయాన్ని వివరించింది. కోశాధిపతి తన సాక్ష్యమిస్తూ వాస్తవాన్ని విశదపరిచాడు. మూడు దినాల గడువు మీద ఆ నగ అరువుగ ఇవ్వబడిందని దర్యాప్తులో రుజువయింది. కాని కోశాధిపతి ప్రజల అమానత్‌ను అలా అరువుగా ఇవ్వడం ఖియానత్ (విశ్వాసఘాతుకం) అవుతుందని ఖలీఫా అన్నారు. భద్రపరచమని ఎవరయితే సొమ్ము నిచ్చారో వారి అనుమతి లేకుండా ఆ విధంగా అమానత్‌ను ఉపయోగించుకోవడం కూడా ఖియానత్ (విశ్వాసఘాతుకం) గానే పరిగణించబడుతుందని ఖలీఫా అభిప్రాయపడ్డారు. కోశాధికారి, ఖలీఫా పుత్రిక తమ తప్పును గ్రహించారు. అందుకు పశ్చాత్తపం వెలిబుచ్చారు. బంగారు నగ వెంటనే ధనాగారానికి వాపసు చేశారు.

# ధీరత్వం పుట్టుకతో వచ్చే గుణం

సాహసం అనేది అందరికీ అబ్బే గుణం కాదు. ఏ కొందరో ఈ మహా భాగ్యానికి నోచుకుంటారు. అద్వితీయ ఘన కార్యాలు సాధిస్తారు. చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోతారు. మానవులందరికీ ఆదర్శప్రాయులవుతారు. ఇలాంటి వీరులలో సలాహుద్దీన్ ఒకరు.

ఇరాక్‌లో పూర్వం రిహా అనే ఒక పట్టణం ఉండేది. అది ఆ దేశపు ముఖ్యపట్టణం. మూసిల్‌కు వంద మైళ్ళ దూరంలో ఉండేది. ఇమాదుద్దీన్ అప్పట్లో సుల్తాన్‌గా ఉండేవాడు. ఎంతో చాకచక్యంగా రాజ్యపాలన చేసేవాడు. కాని అధికారానికి దూరంగా ఉన్న రిహా పట్టణంపై కొందరు దోపిడిగాళ్ళు దాడిచేశారు. ఊరిలోని ధనికుల్ని కొల్లగొట్టారు. దౌర్జన్యకాండను జరిపి అమాయక స్త్రీలను చెరపట్టారు. మహిళల మానమర్యాదలు మంటలపాలవుతుంటే ఎవరు భరించగలరు? నూనూగు మీసాలు మొలుస్తున్న సలాహుద్దీన్ దుండగులు సాగించిన దౌర్జన్యాన్ని సహించలేకపోయాడు. వెంటనే టర్కీ దేశస్థుడయిన ఒక వృద్ధుని తోడుగ తీసికొని ముఖ్య పట్టణమైన మూసిల్‌కు పోయి వచ్చిపడిన విపత్తును సుల్తాన్‌కు విన్నవించి, స్త్రీల మానప్రాణాల్ని రక్షించాలన్న దృఢ సంకల్పంతో ప్రయాణమయ్యాడు, మూసిల్ పట్టణ సరిహద్దులకు చేరాడు.

అక్కడ ఏదో కారణం మీద అటు వచ్చిన సుల్తాన్ ఇమాదుద్దీన్, ప్రయాణం చేత అలసిపోయి కనిపిస్తున్న ఆ వృద్ధుణ్ణి చూశాడు, ఇద్దరు ఊరికి కొత్తవారిలా కనిపించారు సుల్తాన్‌కి. వారి వివరాలు అడగ్గానే అతడే సుల్తాన్ అని తెలియని వారిరువురు కంట తడిబెట్టి తమవారిపై జరిగిన దౌర్జన్యాన్ని తమకు కలిగిన ధన, ప్రాణ నష్టాన్ని వినిపించారు. ఎంతటి దౌర్జన్యం? మీరేమీ చేయలేకపోయారా? అని విచారించాడు సుల్తాన్.

వయసులో చిన్నవాడైనా ధైర్యస్థయిర్యాలు కల సలాహుద్దీన్ "మేమేం చేయగలం? ప్రజల కష్టసుఖాలను తెలుసుకొనక నిర్లక్ష్యంగా రాజ్యమేలుతున్నాడు మా సుల్తాన్. దుండగులు అన్యాయంగా ప్రజలను పీడిస్తుంటే పగటి కలలు కంటూ ఆడంబరాలను అనుభవిస్తూ హాయిగా రాజ భోగాలలో తేలియాడుతున్నాడు సుల్తాన్. అందుకే మాపై ఆసన్నమయిన ఆపదల్ని రాజుగారికి విన్నవించుకుందామని వచ్చాం" అని అన్నాడు.

ఆ చిన్న నోటి నుండి వెలువడిన మాటలు రిహా పట్టణం విషాద గాధను, అక్కడి ప్రజల హృదయావేదనను వ్యక్తపరచాయి. రాజు గుండెపై పిడుగులు పడ్డాయి. అతడు గుర్రం దిగి సలాహుద్దీన్ వీపు తట్టుతూ, "నాయనా! ఆ దురదృష్టవంతుణ్ణి నేనే. దుర్మార్గులు రేకెత్తిస్తున్న అరాచకాన్ని అరికట్టలేకుండా అజాగ్రత్తగా రాజ్య మేలుతున్న ఇమాదుద్దీన్‌ని నేనే" అన్నాడు సుల్తాన్. ఎంతో బాధను వ్యక్తపరుస్తూ తానన్న మాటలకు క్షమించమని రాజును కోరాడు సలాహుద్దీన్. ఆ తర్వాత దుండగుల దాడుల వివరాలను, వారు చేసే నీచపు పనులను విశదంగా విన్నవించాడు. రాజు వారిరువురిని రాజ భవనానికి తీసుకెళ్ళాడు. వెంటనే సైన్యాన్ని సమీకరించాడు. రిహాలో జరుగుతున్న విద్రోహుల చర్యల్ని వివరంగా వినిపించాడు. అప్రమత్తతతో మెలగాలని సేనాధికారులను ఉద్రేకపరిచాడు. సూర్యోదయం కాకమునుపే రిహా చేరాలి. దుండగుల కళ్ళపై కమ్మిన మదాంధకారాన్ని తొలిగించాలి. అరాచకాన్ని అణచి చెరబట్టిన స్త్రీలను విడిపించాలి. ఇవి మన కర్తవ్యాలు." నిగనిగ మెరిసే కరవాలం చేతబూని "నా వెంట వచ్చేవారెవరో ముందుకు రండి" అని పిలుపునిచ్చాడు. హాజరైన సైన్యాధికారులు మహా వీరులే. కాని రాజుగారి మాటలు వారిని ఆశ్చర్యపరిచాయి. దాదాపు వందమైళ్ళ దూరంలో ఉన్న రిహా పట్టణాన్ని ఒక్క రాత్రిలో చేరడం, ఆ రాత్రికి రాత్రే శత్రు

సంహారం చెయ్యడం ఎలా సాధ్యమవుతాయి. శత్రు వశమయిన కోటను స్వాధీనం చేసుకోవడం ఇంత స్వల్ప వ్యవధిలో సాధ్యమేనా? రాజుగారికి మతి భ్రమించలేదు కదా? అంటూ యోచిస్తూ ఉండిపోయారు. ఏమీ తోచక దిక్కులు చూస్తూ ఉండిపోయిన సైన్యాన్ని దాటి మొదటి పంక్తిలోకి వచ్చి,

ఉద్రేకపూరిత కంఠంతో సలాహుద్దీన్ అన్నాడు, "సూర్యోదయానికి ముందే కోటను ముట్టడించేవారితో నేనుంటాను. సుల్తాన్‌కు తోడుగా నేను నిలుస్తాను" అని ప్రకటించాడు. అంతా నిర్ఘాంతపోయారు. అనుభవజ్ఞులు అతణ్ణి ఆశ్చర్యంతో చూశారు. కొందరికది అసందర్భపు వేళాకోళం అనిపించింది. "తమ్ముడూ, చాలు, చాలు. అధిక ప్రసంగం కట్టిపెట్టి పోయి ఆటలాడుకో. ఇది దోబూచులాట కాదు, రణరంగంలో యుద్ధం" అని పరిహసించారు. మహా వీరునికి ఉండవలసిన లక్షణాలు మాత్రం ఆ యువకునిలో అగుపించాయి సుల్తాన్‌కు. అతనికి ఆనందం కలిగింది. సైనికులు కనబరుస్తున్న సంశయానికి, వారి జంకుకు చింతిస్తూ కోపోద్రేకంతో ఈ యువకుడు అంటున్న మాటలు ముమ్మాటికీ నిజం. అతని ముఖ వర్చస్సు అతని మాటల్ని ధృవీకరిస్తూంది. రేపటి రణరంగంలో నా వెంట ఈ బాలుడు తప్పక ఉంటాడు అని అన్నాడు రాజు. ఆవేదన కలిగిస్తున్న సంఘటనలొక వైపు, అగ్గి కురిపిస్తున్న రాజుగారు మరొక వైపు. బల్లెంలా పొడుస్తున్న బాలుని మాటలు ఇంకొక వైపు.

సైనికులంతా రోషంతో, ఆవేశంతో ఉడికిపోయారు. అందరూ సకల సన్నాహాలు చేసుకొని రాజుగారి వెంట తెల్లవారకముందే కోటను ముట్టడించడానికి సంసిద్ధులయ్యారు. ఎలాగైతేనేం రెండవ దినం మధ్యాహ్నానికల్లా రిహా కోట ముఖద్వారం చేరారు. యుద్ధం లేకుండానే విజయం సాధించామని సంబరపడిన విద్రోహులు కాలక్షేపానికని కోటను వదలి వేట కెళ్ళారు. ఆత్మ విశ్వాసంతో దృఢనిశ్చయులైనవారిని అదృష్టం వరిస్తుంది. రంగం అనుకూలంగా మారింది. సుల్తాన్ ఇమాదుద్దీన్ జంగీ నేరుగా కోటపై దాడి చేశారు. విరోధి సైన్యాధిపతి ఎన్నో ప్రయత్నాలు చేసి రాజు సైన్యాన్ని ఆపేందుకు తాపత్రయ పడ్డాడు. కాని లాభం లేకపోయింది. పడగ విప్పిన ఫణిరాజు వలె బుసగొట్టుతూ శత్రు సైన్యాన్ని సంహరిస్తూ తన సైన్యాన్ని పురిగొల్పుతూ వేసిన అడుగును వెనక్కి వేయక హోరాహోరి పోరాటం సాగించారు. భీషణ సమరంలో సుల్తాన్ జంగీకు విరోధి

సైన్యాధిపతికి ముఖాముఖి ఘర్షణ జరిగింది. ఎత్తిన కత్తితో శత్రు సైన్యాధిపతిపై ఓ విసురు వేశాడు రాజు. కాని ఆ సేనా నాయకుడు కవచధారియై ఉండడం వల్ల కవచం రెండు ముక్కలై నేలపడింది. దెబ్బతిన్న నాగువలె ఆ సేనా నాయకుడు ప్రాణాలకు తెగించి రాజుపై పడ్డాడు. ఖడ్గంతో రాజు కుతికను కోయబోయాడు. మెరుపులా సలాహుద్దీన్ ప్రత్యక్షమయ్యాడు. కవచ విహీనుడైన కిరాతక నాయకునిపై ఓ దెబ్బ వేశాడు. అది ఆ సేనానికి చివరి దెబ్బే అయింది. ఆ దెబ్బతో అతడు విలవిల తన్నుకుంటూ నేలకూలాడు. సైన్యాధిపతిని కోల్పోయిన తిరుగుబాటుదార్ల సైన్యం ఛిన్నాభిన్నమై పలాయనం చిత్తగించింది. రిహా నగరం తిరిగి సుల్తాన్ జంగీ ఆధీనంలోకి వచ్చింది. ప్రజలకు అంతులేని ఆనందం కలిగింది. చెరబడ్డ స్త్రీలు విడుదలయ్యారు. అంతా సలాహుద్దీన్ సాహసాన్నే శ్లాఘిస్తూ అతడు మున్ముందు ఇంకా అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఆనాటి యువ సలాహుద్దీన్ పెరిగి పెద్దవాడై గొప్ప సేనానిగా, బైతుల్ మఖ్దిస్‌ను శత్రువుల బారి నుండి రక్షించిన మేటి యోధుడుగా, ఇస్లామీయ చరిత్రలో చిరస్మరణీయుడయ్యాడు. అతనే సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి.

# నిరాడంబర జీవితం

హజ్రత్ ఉమర్ జీవితం ముఖ్యంగా పాలకులైనవారందరికీ ఆదర్శప్రాయం. ఆయన పాటించిన రాజనీతి, ప్రజా పరిపాలనా రీతి నేటి నేతలకు ప్రత్యక్ష మార్గదర్శకం. ఆయన సామాన్య వ్యక్తి కాదు. అప్పటి నాగరిక ప్రపంచంలో మూడో వంతు భూభాగాన్ని పాలిస్తున్న ఖలీఫా, ఇస్లామీయ రాజకీయాలలో ఆయన అనుసరించిన విధానాలు, ఆయన వ్యక్తిగత జీవితం అందరికీ అనుసరణీయం. ఆయన వేసుకునే దుస్తుల్ని చూస్తే అవి సర్వ సాధారణమైనవి. తనకు నచ్చిన మూడు విషయాల్ని ఎప్పుడూ ప్రస్తావించేవారు. ఒకటి: ఇస్లామ్ ప్రచారం, ధర్మ సంస్థాపనం. రెండు: మంచిని పెంచడం, చెడును నిర్మూలించడం. ఆ తరువాత మూడు: పాత బట్టల్ని వినియోగించుకోవడం! ఇవి ఆయనకు ఎంతో ఇష్టం. తరచు ఆయన పాత బట్టలనే ధరించేవారు. ఆయన దుస్తులలో ఎప్పుడూ అతుకులు అగుపిస్తూ ఉండేవి.

ఒకప్పటి విషయం, ఒక సమావేశంలో ఉపన్యసిస్తున్నారు. కాని ప్రేక్షకుల దృష్టి ఆయన వేసుకున్న దుస్తులపై పడింది. అసలే అది అతుకులమయం, అదీగాక అందరికీ ఆశ్చర్యం కలిగించే మరొక విషయం ఏమిటంటే అతుకుల్లో ఒకటి తోలు ముక్క కూడా ఉంది.

ప్రభుత్వ ధనాగారాల్లో పట్టలేనంత సంపదలుండి, ప్రజలు లేమి అన్నదేమిటో తెలియని సౌభాగ్య జీవితం గడుపుతున్న కాలం అది. అలాంటి సంక్షేమ రాజ్యానికి అధినేత అయినప్పటికీ అతుకుల చొక్కా వేసుకొని వేదికపై ఉపన్యసించటం ప్రేక్షకులనందరినీ ఆశ్చర్యం కలిగించింది. ఖలీఫా అట్టి బట్టలను వేసుకోవడం ఆవేదనను కలిగించింది. ఆ కారణంగా వారు ఆయన అలాంటి వస్త్రధారణను విడనాడాలని, కనీసం అతుకులు లేని బట్టలయినా వేసుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఈ అభిప్రాయం సమంజసమైందే కాని ఆ మాటను హజ్రత్ ఉమర్ లాంటి గంభీర స్వభావుని వరకు చేరవేసేదెలా? కొందరు కూడారు, హజ్రత్ ఉమర్ సమక్షంలో హాజరయ్యారు. కాని ఏం లాభం, వారంతా హజ్రత్ ఉమర్ మనస్తత్వం తెలిసిన వారే.

కరచాలనం చేసి క్షేమసమాచారాలు మాట్లాడుకుంటున్నారు. అసలు విషయం చెప్పే ధైర్యంలేక వచ్చిన త్రోవనే తిరిగిపోయారు. ఎలాగైతేనేం మరో ఉపాయాన్ని ఆలోచించారు.

హజ్రత్ హఫ్సా (రజి) మహా ప్రవక్త సతీమణులలో ఒకరు. ఆమె హజ్రత్ ఉమర్ ప్రియపుత్రిక కూడా. ముస్లింలకు మాతృమూర్తి వ్యాకులపడిన ఆ ప్రజలు ఆమె వద్దకు వెళ్ళారు. తండ్రిగారికి నచ్చజెప్పి అతుకులు వేసిన దుస్తుల్ని వేసుకోవడం మాన్పించమన్నారు. హజ్రత్ ఉమర్‌కు ఆమె పట్ల ఎంతో ప్రేమ ఉండేది. ఆమె తండ్రి వద్దకు వెళ్ళి ప్రజాభిప్రాయాన్ని వెల్లడించారు. మహాప్రవక్త (సఅసం) జీవితాన్నే ఆదర్శంగా నిర్ణయించుకున్న ఆ మహనీయుడు ప్రియ పుత్రికను చూచి, "అమ్మా! మీకు మహాప్రవక్త (సఅసం) సతీమణిగా గడిపే భాగ్యం లభించింది. మీ గదిలో మహాప్రవక్త వాడుకునే వస్తువులు ఏవో చెప్పండి" అని అన్నారు. ఆ మాటలు విన్న హజ్రత్ హఫ్సాకు ఒక్కసారి మహాప్రవక్త (సఅసం) జీవితం కళ్ళముందు సాక్షాత్కరించింది. "నా గదిలో కేవలం ఖర్జూరపు ఆకులతో చేసిన

ఒకే ఒక చాప ఉండేది. దాన్ని రెండు మడతలు వేసి పడకగా వినియోగించుకునేవారు దైవప్రవక్త (సఅసం). దానిపైనే ఆయన విశ్రాంతి తీసుకునేవారు. తరచూ ఆ చాప గుర్తులు మహాప్రవక్త దేహంపై పడేవి."

"ఒకసారి నేను చాపను నాలుగు మడతలుచేసి మెత్తగ వేశాను. యథాప్రకారం మహాప్రవక్త దానిపై విశ్రాంతి తీసుకున్నారు. మెలుకువ కలిగిన తక్షణమే, 'ఓ హఫ్సా! ఈ పూట పరుపును ఏం చేశావు నాకు బాగా నిద్రపట్టిందే' అన్నారు. ఉన్న సంగతి చెప్పాను. అది విని ముందు మాదిరిగానే చాపకు రెండుగా మడతలు వేయాలి" అన్నారు ప్రవక్త (సఅసం).

ప్రియ పుత్రిక నోట వెలువడే మహా ప్రవక్త జీవిత విషయాలు విన్న హజ్రత్ ఉమర్ "హఫ్సా! మానవాళికి ధర్మమార్గం చూపిన ప్రవక్త శ్రేష్ఠులు పరిమిత వస్తువులతో అతి సాధారణ జీవితం గడిపినప్పుడు ఆయన్నే అనుసరించి జీవించే మాలాంటి వారికి ఖరీదయిన దుస్తులు ధరించి జీవించే అవకాశం ఎక్కడిది? మంచి దుస్తులు ధరించాలని నాపై ఒత్తిడి తేవడం దేనికీ?" అని సావధానపరిచారు. అంతటితో అలాంటి ప్రస్తావన చేయడం మానేశారు ప్రజలు.

# నీటి ఎద్దడి

హారూన్ అల్ రషీద్ పరిపాలించిన కాలం అది. అప్పట్లో మక్కా ప్రజలు పంచభక్ష్య పరమాన్నాలు భుజించినా, పీతాంబరాలు ధరించినా దోసెడు నీళ్ళకు నానా అవస్థలుపడేవారు. ప్రజలంటే అవధుల్లేని ప్రేమగల హారూన్ అల్ రషీద్ సతీమణి జుబైదా హృదయం నీటి కొరకు అల్లాడే మక్కా ప్రజల్ని తలచుకుని ద్రవించిపోయేది. ఎడారి ప్రాంతంలో ఓ మంచినీటి కాలువ ప్రవహింపజేయాలి- ఎలా? అని ఎప్పుడూ యోచిస్తూ ఉండేది. మక్కా వాసుల మంచినీటి కోసం రాజ్యంలో ఉన్న సాంకేతిక నిపుణుల్ని అందరినీ ఆహ్వానించింది. వారంతా సమావేశమయ్యారు. రాణీగారు తన మనోవేదనను వ్యక్తం చేసి, మక్కా వాసుల నీటి ఎద్దడిని దూరం చేసేందుకు ఉపాయం ఏమిటో యోచించాలని ఆదేశించిందామె. ఏ మాత్రం ఆలస్యం చేయక ప్రయత్నాలు మొదలెట్టారు. చుట్టుప్రక్కలనున్న ప్రదేశాలన్నీ గాలించారు. నీటి వనరులున్న ప్రాంతాలు పరిశీలించారు. నీరు మక్కాపురం చేరడానికి పథకాలు, ప్లాన్‌లు తయారుచేశారు.

వివరమయిన పథకాలు, ప్లానులతో ఖలీఫా సతీమణి వద్ద సమావేశ మయ్యారు. "అమ్మా! సమస్యకు పరిష్కారం గోచరించింది. తాయిఫ్ లోయలో చక్కటి సెలయేరు ఉంది. అది హునైన్ కొండల వైపునకు ప్రవహిస్తూంది. ఆ నీళ్ళు అమృతతుల్యంగా ఉన్నాయి. కాని దాన్ని మక్కాకు మళ్ళించడం సాధ్యం అయ్యేలా అగుపించడం లేదమ్మా! ఈ పని అంత సులభం కాదు. ఎన్నో కొండలు, గుట్టలు, బండరాళ్ళు మార్గంలో అడ్డువస్తున్నాయి. ఈ అవరోధాల్ని తొలగించి కాలువ కట్టవలసి ఉంటుంది. ఈ నిడువయిన కాలువ కట్టించడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని, బోలెడంత డబ్బు ఖర్చవుద్ది" అని విన్నవించు కున్నారు.

నిపుణులు చేసిన సిఫారసు జుబైదాకు ఆమోదయోగ్యమయింది. "ఖర్చును ఖాతరు చెయ్యకండి. ప్రజల సౌకర్యం, సౌలభ్యాల ముందు అదెంత? పని ప్రారంభించండి, అవసరమయితే త్రవ్వకాలలో ప్రతి గునపం దెబ్బకు ఒక బంగారు నాణెమయినా సంతోషంగా ఖర్చు చేస్తాను" అని ధైర్యం చెప్పింది జుబైదా. పని ప్రారంభమయింది. నిపుణులు తాయిఫ్ లోయలో పుట్టిన ఊటను మక్కాకు చేర్చేందుకు కాలువ త్రవ్వించారు. దారిలో వచ్చిన ఎన్నో చిన్నచిన్న ఊటల్ని ఈ కాలువలో కలుపుకుంటూ వచ్చారు. కాలువ రానురాను నదిగా మారి మక్కాకు చేరింది. 'నహరె-జుబైదా' పూర్తయి ప్రజలకు మంచి నీటి వసతి కలిగింది.

ఈ బృహత్కార్యంలో ఎందరో కష్టపడ్డారు. మూడేండ్లు నిరంతర కృషి జరిగింది. ధనం, కాలం, శ్రమల మాట ఏమయినప్పటికీ కాలువ మాత్రం పూర్తయింది. జుబైదా ప్రజలకు చేకూర్చదలచిన సౌలభ్యం నెరవేరింది. పని ప్రళయం వరకు నిలిచేటట్లు జరిగింది. 'నహరె- జుబైదా' (జుబైదా కాలువ) నే కాకుండా ఆమె కాబాలోని జమ్ జమ్ బావిని కూడా మరమ్మత్తు చేయించారు. ఆనాటి మంచి నీటి పథకం 'నహరె-జుబైదా' నేటికీ అక్కడి ప్రజలకు మరియు లక్షలాది సంఖ్యలో ఏటేటా వచ్చే హజ్ యాత్రీకులకు నీరు సరఫరా చేస్తోంది.

-: సమాప్తం :-